# ఆంతర్యం - అభిమానం

కొద్దిగా డబ్బు అవసరం వచ్చింది. పెద్ద పోస్టాఫీసు సేవింగ్సులో వందో వంద యాభయ్యో డబ్బువుంది. ఆ డబ్బు తీసుకుని వచ్చి మందులు నేనే కొనుక్కుని వచ్చి ట్రీట్‌మెంటు ఆరంభిస్తే యీ కేసు తప్పక విజయవంతంగా నెరవేరుతుందని మనసుకి చెప్పుకున్నాను. ఊళ్ళో నాకేమీ మంచి పేరుపడలేదు. నెలరోజులయినా ఒక్క కేసుకూడా రాలేదు. ఓ రకమైన విషప్రచారం కూడా నామీద సాగుతున్నట్లు కర్ణాకర్ణిగా నాకు చేరింది. నేనేం చెయ్యగలను! చిన్న ఊరాయె. ఏరికోరి యీ పల్లెలాటి పట్టణములో ప్రాక్టీసు చేదామని వచ్చాను. పట్నాల్లో ఈర్ష్యకలిపి పోటీ గవర్నమెంటు వారి ఆస్పత్రులకు తోడుగా యెందరో ప్రైవేటు డాక్టర్లున్నారాయె. అదీకాక పల్లెటూళ్ళో ప్రశాంతంగా జీవించవచ్చునుగదా అని ఆలోచన చేసుకున్నాను.

ఇప్పుడు నేను డబ్బు తెచ్చుకోవాలంటే జిల్లా కేంద్రానికి పోవాలన్న మాట. ఆ ముసలాడు డబ్బు కలవాడేనట. బ్రతుకుదామని వుద్దేశం లేనివాడట. ఎందుకంటే బాధతో బ్రతకలేక అయివుండవచ్చు. గుండెలో విపరీతమైన నొప్పి వస్తుంటుందని చెప్పాడు. "నేను యెందరిదగ్గరో వైద్యం చేయించుకున్నాను. ఏ మాత్రమూ లాభం లేకపోగా బ్రతక్కుండానూ చావకుండానూ చేశారు. బాగా బ్రతక గలిగితే కొంతడబ్బు ఇస్తాను. దాకే రావాలిగాని చచ్చిపోతే యేమీ యిచ్చేదే వుండదుగదా" అన్నాడు ముసలాడు. నేను జాగ్రత్తగా పరీక్షించి స్వంత ఖర్చుతో అతడికి ట్రీట్‌మెంటు యిచ్చేందుకు నిశ్చయించుకున్నాను.

ప్రొద్దున్నే బస్సుయెక్కి పదిన్నరకల్లా జిల్లా కేంద్రాన్ని చేరుకున్నాను. హోటలులో భోజనంచేసి పోస్టాఫీసు చేరుకునేసరికి పదకొండున్నర అయింది.


అప్పటికే పెద్ద క్యూ వుంది కౌంటరు దగ్గర. నేను విసుక్కుంటూ అక్కడే ఒక బల్లమీద కూలబడ్డాను. నేను తీసుకుంటున్న కేసు గురించే నా ఆలోచనలన్నీ నిండి వున్నాయి. ఈ కేసు సఫలమైతే నా మనస్సుకింత శాంతి దొరికి నాకు భృతి యేర్పడు

## ఎ. రమాపతిరావు

తుంది. ఆ పల్లె ప్రజల వింత మనస్తత్వం గురించి నాకు విచిత్రమైన ఆలోచనలు వచ్చినై. వాళ్ళను గురించ జాలి పడటంకన్న నేనేం చేయగలను. ఇంతకూ నాకు పెళ్ళి పెటాకులు కాలేదన్న సంగతి వాళ్ళకెలాగో తెలిసింది. అప్పటినుంచీ వొక ప్రచారం సాగింది. ముప్ఫయ్యేళ్ళు పైబడ్డ ఇతనికి ఇంత వరకూ పెండ్లెందుకు కాలేదు. ఇలాటి పల్లెకు యెందుకు వచ్చాడు? ఏదో కథ వుండి వుంటుంది. దీనికితోడు ఆ వూళ్ళో నేటివ్ డాక్టర్ శరభాచారి "అతడి సంగతి నాకు బాగా తెలుసు. కాలేజీలో గోల చేసితే ఒక సంవత్సరంపాటు ఇంటికి పొమ్మన్నారు. ఇంతకూ అతని ప్రవర్తన మంచిదిగాదనే కాలేజీ అధికారులు అలా చేశారట. బుజువంతలేనివాడు" అని అక్కడక్కడా చెపుతూ వచ్చాడట. పాపం, అతనిభయం అతనిది. కేవలం భగవంతుడిమీద భారంవేసి, ఆయుష్షు లేకపోవటం, ఋణం తీరిపోవటంలాటి మాటలు తరచు ఉపయోగిస్తూ వైద్యంచేసే అతను నన్ను చూసి ఈర్ష్య, అసూయా, క్రోధం లాంటివి పెంచుకోవటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కాని ప్రచారంవలన ఒక్కోసారి యెంత విషమపరిస్థితులు ఉత్పన్నమవుతాయో, ఆపాటి సంస్కారంలేని అతడు వూహించలేకపోయాడు. నిజంగా అతడెవరో నాకు తెలియదు. అటువంటిది నాగురించి, నా నైతిక విలువలగురించీ అతడు చేసే ప్రచారం నన్ను పూర్తిగా క్రుంగతీసిందనే చెప్పాలి. జీవితంలో యెన్నోరకాల అపజయంపొంది, ఆత్మవిశ్వాసం కోల్పోయి, వంచితుడనై, ప్రపంచంమీద కసి కొద్ది సర్వనాశనమై, గోతను తోడుక్కుంటున్న నాకువలెను వేరుపురుగులా శరభాచారి తారసపడ్డాడు. నిజమే నైతికవిలువలను కోల్పోయాను. విచ్చలవిడిగా సంచరించాను. అందుకే అనుభవాల అగ్నిగుండంలో అగ్నిపరీక్షకు నిలబడి పరిశుద్ధుడనై క్రొత్తచోట బ్రతుకుచిగురించుకోవాలని వచ్చాను. కాని చిత్రమైన ప్రపంచం నన్ను విచిత్రమైన పరిస్థితులలోకి యీడ్చుకొచ్చింది.

కౌంటర్ దగ్గర 'క్యూ' ఇంకా పెరిగిపోతున్నది. ఇలాఅయితే లాభం లేదని నేను వెళ్ళి క్యూలో నిలుచున్నాను. ఆఫీసుల్లో ఉద్యోగస్తులు యీ ప్రభుత్వం నాదనీ, యీ ప్రజలు నా వాళ్ళనీ, అంతరాంతరాలలో అభిమానపడి పని చెయ్యరు. అందువలననే నిత్య జీవితంలో సామాన్యులకింత అసంతృప్తి. రోజురోజు సాంఘిక వ్యవస్థ దిగజారిపోవటం. పాపం వాళ్ళుమాత్రం యేం చేస్తారు? వాళ్ళకూ అసంతృప్తే నాయె. ఒకరోజుది కాదు, ఒక పూటది కాదు. అందువలన వాళ్ళూ యేదో నిర్లిప్తతతో పనిచేసుకుంటూ పోతారు.

నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. కలలాగావుంది. సిద్ధహస్తుడైన రచయిత వ్రాసిన కథ అనుకోనివిధంగా మలుపులు తిరుగుతుంటే పాఠకుడు యెలా ఆశ్చర్యపోతాడో అదేవిధంగా నేనూ ఆశ్చర్యం పొందాను. అయితే ఇంకా కొద్ది అనుమానంగానే వుంది. దూరాన వొక ఆడ గుమాస్తా కన్పించటమే యీ నా ఆశ్చర్యానికి కారణం. అయితే ఆమె స్త్రీ అయినందువల్ల కాదు నాకు ఆశ్చర్యం. అక్కడ ఆ

సుఖజీవిత సేవ

భారత "సిద్ధ వైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము.

"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, కుష్ఠరోగనివారిణి

భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి మేహరోగ నివారణ మాత్ర, లేహ్యము.

డా॥ కే. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు,

5/22, మేల్ మాయిల్. (P. O.) (N. A. Dt.) S. India.



కళాస్వాదన

—చిత్రం : రావాడ కృష్ణ.]

కుర్చీలో కూర్చుని తలవంచి పనిచేసుకుంటున్నది శ్యామల అని మనసు గటిగా నమ్ముతున్నది.

నా అనుమాన నివృత్తికోసం ఆమె తలయెత్తి చూస్తుందేమో నన్న ఆశతో ఆమె వేపే చూడసాగాను. ఆమె శ్యామలే అని నిర్ధారించుకోవాలని నా మనసులోని కోర్కె క్షణక్షణ ప్రవర్ధమాన మవుతున్నది. నేను ఒక్కొక్క అడుగే ముందుకు పోతున్నాను. కాని శ్యామల మాత్రం తలయెత్తి చూడలేదు. ఆమెను పిలుదామన్న ఊహ నాలో జనించక పోలేదు, కాని ఆమె శ్యామల కాకపోతే—'క్షమించండి, మా శ్యామల అనుకున్నాను,' అనవచ్చును. కాని ఆమె వినుకుంటుందేమో! వీళ్ళంతా యేమనుకుంటారో! అయినా ఆమెను పిలుద్దామన్న ఊహ నాకే లజ్జాకరంగా తోచి వదిలేశాను.

నామనస్సు ఆమె శ్యామలేఅని దృఢంగా నమ్ముతున్నది అసలు నేనింత వితర్కంలో పడి కొట్టుకునేవాణ్ణి కాను. కాని శ్యామలను చూసి నాలుగేళ్ళు కావస్తున్నది. ఆమె పెళ్లికి పోలేదు. కాని తరువాత రైల్లో ప్రయాణం చేస్తూ కలుసుకున్నాము. అప్పుడే శ్యామల తన భర్తనుకూడా నాకు పరిచయం చేసింది. ఆ నాడు నా దురదృష్టానికి నేను యెంతగానో చింతించాను. తరువాత కొన్ని విషాద సంఘటనలలో, నే నెరిగిన వాటన్నిటిలో అతి విచారకరమైంది శ్యామల భర్తను కోల్పోయి నిరాధార కావటం. చిన్నతనంనుంచీ కర్మ సిద్ధాంతంమీద నమ్మకమున్న నాకు శ్యామలను ఆనాడు చేసుకోలేక పోవటానికిగల కారణం తెలిసింది ఆ రోజున. శ్యామలని యెంతో చిన్నతనం నుంచి నేను యెరుగుదును. శ్యామలని నేను పెళ్ళిచేసుకుంటానని అనుకునే కొంతమందితోపాటు నేనూ అనుకునేవాణ్ణి. కాని చిత్రంగా నేను శ్యామలను పెళ్ళి చేసుకోలేక పోయాను. ఆ రోజుల్లో యీరహస్యం గురించి ఆలోచించలేక యెంతో యిదయిపోయేవాణ్ణి. కాని కొద్దిరోజుల తర్వాత తెలిసింది శ్యామలకే యిష్టం లేకపోయిందట. ఈ విషయం తెలిసిన రోజున శ్యామలని పెళ్ళిచేసుకోలేక పోయినందుకు పడిన బాధకంటె యెక్కువ బాధపడ్డాను. అవాళ నా మనసుని నా ఆలోచనతో దారుణంగా హింసించుకున్నాను. అవాళ నాకు గతం అవమానకరంగా, వర్తమానం అశాంతితో కూడుకున్నదిగా, భవిష్యత్తు ఆశాలేశము లేనిదిగా కన్పించింది.

నేను అలా చూస్తూనే ముందుకు జరుగుతున్నాను. గడియారంకేసి చూసుకున్నాను. మూడు నిమిషాలు, నాలుగు నిమిషాలకు ఒక మనిషి కౌంటరు దగ్గరనుంచి వెళ్ళిపోతున్నారు. ఇంకా నాముందు తొమ్మిదిమంది వున్నారు. అంటే దగిరదగిర ఇంకొ నలభై నిమిషాలు నేను క్యూలో వుండవలసివుంటుందన్నమాట. ఈ లోపునైనా ఆమె నాకేసి చూడవచ్చు. ఆమె శ్యామలేనని నేను నిర్ధారించుకోవచ్చు. కాని ఆమె నలభై నిమిషాలు గడచి నేను కౌంటర్ దగ్గరకు వచ్చేసరికి ఒక్కసారి కూడా తలయెత్తి చూడలేదు. పధ్నాలుగుసార్లు ఆవలించింది. మూడుసార్లు వొళ్ళు విరుచుకుంది. రెండుసార్లు కళ్ళజోడు తుడుచుకొని కళ్ళు కూడా తుడుచుకుంది. పాపం—అంత కష్టపడుతూ యీ వుద్యోగం చేయకపోతే ఏమౌననుకున్నాను. నేను కౌంటర్ దగ్గరకు వచ్చి రెండుసార్లు దగ్గి సహజంకాని స్వరంతో ఆకర్షించి యేదో అడిగాను రూల్సు గురించి కావాలని. అప్పుడామె తలయెత్తి చూసింది. నా అనుమానం తీరిపోయింది. కాని ఆమె చాలా మామూలుగా తల దించుకొని తనపని తాను చూసుకోసాగింది. నాకు మరీ ఆశ్చర్యమయింది. ఆమె నన్ను గుర్తించలేదా—గుర్తించికూడ యిలా ప్రవర్తిస్తున్నదా—నేను వొకరకమయిన అసంతృప్తితో అలానే నిలుచుండిపోయాను. డబ్బు తీసుకున్నాను. బయటకు వచ్చాను. ఒంటిగంట పైనే అయింది. ఓ క్లర్క సిగరెట్ కాల్చుకుందామని కాబోలు బయటకు వచ్చాడు. అతణ్ని అడిగాను 'ఆ అమ్మాయి పేరేమి'టని. అతడు చెప్పాడు. "ఆమె యిప్పుడు బయటికి వస్తుందా?" అతడు నా వేపు అసహ్యంగా చూసి 'రాదు' అన్నాడు.

నేను మళ్ళీ లోపలికి వెళ్ళాను. ఆమె ఫ్లాస్కులోని కాఫీ వంచుకుని తాగుతున్నది. ఈ సారి నన్ను బాగానే చూసింది. కానీ నన్ను గుర్తించానన్న విషయం ఆమె బయట పడనియ్యలేదు. నాకు ఏం చెయ్యటానికీ తోచలేదు. ఇప్పుడు వెళ్ళి మందులు కొనుక్కొని మూడుగంటల బస్సులో వెళ్ళిపోవచ్చును. కాని నాకు శ్యామలతో యెలానైనా మాటాడాలని వుంది. ఒక ప్యూనుజవానుని పిలిచి నా పేరూ ఊరూ వ్రాసి వొక చిన్న చీటిని ఆమెవద్దకు పంపించాను. దానికి వెనక ఆమె తన ఇంటిఅడ్రసు వ్రాసి ఐదు గంటలతరవాత ఇంటికిరమ్మని కోరింది. నేను తృప్తిపడి బజారు వేపు వెళ్ళిపోయాను. ఆమె శ్యామలే!

మందులన్నీ కొనుక్కొని కాఫీ తాగే సరికి నాలుగు గంటలైంది. ఒకగంట అటూ ఇటూ తిరిగి రిక్షా మాటాడుకుని శ్యామల గారింటికి చేరుకున్నాను. శ్యామల అప్పుడే ఆఫీసునుంచి వచ్చింది కాబోలు నీరసంగా, వొళ్ళో పాపను కూచోబెట్టుకుని కుర్చీలో కూర్చునివుంది. నన్ను చూడగానే చిరునవ్వుతో ఆహ్వానించింది. నేను వెళ్ళి వేరే కుర్చీలో కూర్చున్నాను. ఇంట్లోంచి శ్యామల వాళ్ళఅమ్మ వచ్చి నన్నుచూసి

(47 వ పేజి చూడుడు)

# ఆంతర్యం - అభిమానం

(31-వ పేజీ తరువాయి)

ంట తడిపెట్టుకుని పాపను తీసుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

శ్యామలతో యెలా మాటాడాలో, యేం మాటాడాలో నాకు తోచలేదు. ఆమే నన్ను అడిగింది యెక్కడ వుంటున్నదీ, యేం చేస్తున్నదీ. నేను చెప్పాను. "అంత పల్లెటూళ్ళో పడివుండటానికి మీ ఆవిడ యెలా వొప్పుకున్నదీ" అని ఆమె ఆశ్చర్యం ప్రకటించింది.

నేను చెప్పాను, నాకు ఆవిడంటూ ఎవరు లేరన్న సంగతి. ఆమె మరీ ఆశ్చర్యపడింది.

"ఎంచేత పెళ్ళి చేసుకోలేదు?" అని అడిగింది.

ఇలాంటి అసందర్భపు ప్రశ్నకి యేమని సమాధానం చెపుతాను. నవ్వి వూరుకున్నాను.

"త్వరగా పెళ్ళిచేసుకో," అని సలహా యిచ్చింది.

"చూస్తాను," అన్నాను.

ఇలా కొంత సంభాషణ వో క్రమంలో నడచిన తర్వాత నేను అడగదలచుకున్నది అడిగాను. ఆమె అతిసహజంగా, "వెంకట్రావు యూనివర్శిటీలో యం. ఎ. చదువుకుంటున్నాడు," అని చెప్పింది.

"ఎన్నాళ్ళైంది యీ ఉద్యోగంలో చేరి?" అని అడిగాను.

"సంవత్సరం దాటుతున్నది. వెంకట్రావుకి యీ యేడుతో చదువైపోతుంది. నేనూ ఉద్యోగం మానేస్తాను," అని చెప్పింది.

వెంట్రావు శ్యామలకు మరది. వెంకట్రావుతో నాకు బాగా పరిచయంకూడా వుంది. అయితే శ్యామల వెంట్రావుకోసం బ్రతుకు సుఖం ఏదైనా మిగిలివుంటే దాన్ని కూడా అమ్ముకుంటోందన్నమాట. వెంకట్రావు వట్టిబుద్ధిహీనుడు. పనికిరానివెధవ. అతడు చదువుకోకపోతే యెవరేడ్చారు. జీవితసుఖం నుండి వంచితురాలైన ఆమె తన పాపను విడిచిపెట్టి పగలంతా ఆఫీసులో చాకిరీ చేయటానికి కారణం వెంకట్రావు. వెంకట్రావు మీద నాకు చెప్పలేని అసహ్యం కలిగింది.

ఇంకా శ్యామల చెప్పింది. తను ఎనభై రూపాయల దాకా పంపిస్తుందట. ఏదో బుద్ధిమంతుడు కనుక కష్టపడి చదువుకుంటున్నాడూ. నాకు ఆ వెంకట్రావు మీద బాగా కోపమొచ్చింది.

శ్యామల ఇంకా ఇంటి విషయాలేవో చెప్పింది. నన్ను ఆ రాత్రికి భోజనానికి వుండమన్నది. కాని నేను సెలవుతీసుకుని వచ్చేశాను. ఆ రాత్రే వూరికి చేరుకున్నాను.

మర్నాడు ప్రొద్దున నేను మొట్టమొదట చేసినపని వెంకట్రావుకి ఉత్తరం వ్రాయటం. ప్రపంచ పరిస్థితులూ, నీతి, దయా, సానుభూతి, జాలీ అంటే యేమిటో, అతి వ్యక్తుల పట్ల యెప్పుడెప్పుడు చూపాలో, యెందుకు బ్రతకాలో, సజీవమైన మానవుడు యెలా బ్రతకాలో, యెన్నెన్నో వ్రాశాను. అప్పటికి నా మనసుకి వూరట కలిగింది. దారుణమైన విషయమేమిటంటే మనిషి తాను ఆచరించలేని సిద్ధాంతాలను ఇతరులకు వుపదేశించటం. నేను యేదో నాకుతోచింది వెంకట్రావుకి వ్రాశాను. నేను సక్రమంగా బ్రతుకుతున్నానా అంటే అది వేరేవిషయం. తరువాత చాలా రోజుల దాకా నాకు శ్యామలవాళ్ళ సంగతులు తెలీలేదు. భగవంతుడి దయవల్ల నేను పట్టుకున్న మొదటి కేసు విజయవంతమైంది. ఆ రోజు నుంచీ క్రమక్రమంగా ఆ పల్లెలో నా యెడల వైముఖ్యం తగిపోయి నా ప్రాక్టీసు కూడా పెరిగింది. ఒక్క సంవత్సరం గడిచేసరికి నేను దిగులుపడవలసిన అవసరం లేకపోయింది. నాకు ధృతి యేర్పడింది. తరువాత యెప్పుడో నాకు వెంకట్రావు పెళ్ళి శుభలేఖ పంపించింది శ్యామల.

శ్యామల యెప్పుడేనా నన్ను గురించికూడా అనుకుంటుంటోందికదా అని నేను సంతోషించాను.

తరువాత కొద్దిరోజులకు నా ప్రాక్టీసు బాగా పెరిగిపోయి వూపిరిపీల్చుకునేందుకు కూడా తీరిక లేకుండా పోయింది. తరువాత కొద్దిరోజులకు వొక అపరేషన్ సందర్భంలో రోగినితీసుకుని నేను జిల్లాకేంద్రానికి వెళ్ళాను. అపరేషన్ విజయవంతమైంది. నాకు పూర్తిగా తీరికలభించింది. శ్యామలను చూసిరావాలని సాయంకాలంపూట వెళ్ళాను. శ్యామల తన పిల్లాడితో ఆడుకుంటున్నది. పిల్లవాడు పెద్దవాడేనాడు. ముద్దుగా తప్పటడుగులు వేస్తున్నాడు. శ్యామల వాణ్ణి నవ్విస్తూ తాను నవ్వుతున్నది. నన్ను సాదరంగా ఆహ్వానించింది. నేనువెళ్ళి కూచున్నాను. శ్యామల ఉద్యోగం మానేసిందట. అందుకు నా కెంతైనా సంతోషంకలిగింది. పావుగంట గడిచినతరువాత నాకు కాఫీ తీసుకొచ్చి యిచ్చింది. కాఫీ చప్పరిస్తూ నా మనసు యెంతో ప్రశాంతిని అనుభవిస్తుండగా "వెంకట్రావు ఏమంటున్నాడిప్పుడు?" అని అడిగాను. శ్యామల దిగులుగా, తమాషాగా నవ్వింది.

"కొత్తగా పెళ్ళాంవచ్చిన వాళ్ళంతా యేమంటారు. అతడూ అదే అంటున్నాడు. అవును నీకేంతెలుస్తుంది," అని నవ్వింది. నేనూ యెందుకో నవ్వాను.

"నీవు ఉద్యోగం మానేశావుకదా, నీకు యెంతపంపిస్తున్నాడిప్పుడు?" అని అడిగాను.

"ఏమీ పంపించటంలేదు. నేనే వద్దన్నాను" అన్నది.

నా మనసు మూలిగింది. వెంకట్రావుమీదా కోపమూ, అసహ్యమూ, యేదో నిర్వచింపరాని బాధలు కలిగాయి.

నేను ఏదో ఆలోచించటం కనిపెట్టి శ్యామల అన్నది. "వెంకట్రావు ప్రతినెలా ఒకటో తారీకునే జీతం తీసుకోగానే బాబు పేర ఎనభై రూపాయలు బ్యాంకులో వేస్తున్నాడట. నేను వద్దనికూడా ఉత్తరాలు వ్రాశాను. కాని ప్రతినెలా నాకు తెలుస్తూనే వుంది. బాబు పెదవాడై పెద్ద చదువులు చదువుకోవాలని అతడి వుద్దేశ్యమట."

శ్యామల దిగులుగా చెప్పింది. నేను అప్రతిభుణ్ణయిపోయాను. మనసుకి నిర్వచింపరాని బాధపెడుతుంది వెంకట్రావుని గూర్చి అలా తలచినందుకు. శ్యామల చెపుతున్నది: "డబ్బు దేమివుంది! భగవంతుడు యెలా రాసిపెట్టి వుంటే అలా జరుగుతుంది. అభిమానాలు ఎక్కడనుంచి కొనుక్కొని వస్తాము. అభిమానం డబ్బుతో వస్తుందా—ఈనాడు నేనంటే వెంకట్రావుకి యెంత అభిమానమో—ఇప్పుడు కొద్దిగా కూడా అభిమానంలేదు. పరాయివాడయిపోయినాడు." ఆమె కళ్ళలో యెంత దిగులో చెప్పలేను. ఎంతో బాధగా చెప్పింది.

నాకు చాలా ఆశ్చర్యమైంది. ఆమె అజ్ఞానం చూసి నాకు జాలికూడా కలిగింది. ఇలా ఆలోచిస్తుందేం! శ్యామల కన్నీళ్ళు తుడుచుకుంది. నేను సెలవు తీసుకుని వచ్చేశాను. దారిలో ఆలోచించాను. వెంకట్రావు ఇలా మారిపోవటానికి కారణం నేనే నేమోనని, నేను వ్రాసిన ఉత్తరమేమోనని, అంతే వొదిన నాతో తనను గురించి యేం చెప్పిందో అనే భావనేనేమోనని నాకు తట్టింది. నన్ను నేను తిట్టుకున్నాను కూడా ఆ ఉత్తరం యెందుకు వ్రాశానా అని. అలాంటి ఉత్తరాలవల్ల అటువంటి మనుషులు మారిపోవటం మానవ ప్రకృతికి విరుద్ధమైన విషయమేమీ కాదు. కాని నాకిప్పుడు వెంకట్రావుమీద యేమీ కోపంలేదు. ★

* "స్నేహలత" *

వివిధ ప్రాంతాలలో మీ సరదాలకి తగిన యువతీ యువకులు మిత్రులుగా లభించి నిత్యం ఉత్తరాలు జరిపిస్తారు. ఉత్సాహానందాలూ, విజ్ఞాన వివేకాలూ కలిగిస్తారు. పూర్తివివరాలకు 8 N. P. స్టాంపులతపాళ్ళ మీ అభిరుచులతో వ్రాయండి.

PALAKOL. P. B. No. 9, W. G. Dt.